


# అప్పుడే సర్దేశారా..?

- ఎన్నికల ఖర్చు కోసం ఆయా మండలాలకు డబ్బుల చేరవేత
- ఒక్కో మండలానికి దాదాపు రూ.5 కోట్లు..?
- జిల్లాలోని ఓ వైసీపీ నేత ముందుచూపు

నంద్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. నందికొట్కూరు మినహా మిగతా ఎమ్మెల్యేలకు వైసీపీ అధిష్ఠానం నుంచి టికెట్‌పైన ఎలాంటి స్పష్టత రాలేదు. అయినా కొంతమంది మాత్రం టికెట్ మళ్లీ తమకే అనే ధీమాతో ఉన్నారు. ఓ నేత అయితే ఒక అడుగు ముందుకు వేసి ఎన్నికల ఖర్చుకు అవసరమైన డబ్బును కూడా సమకూర్చుకున్నారు. అంత డబ్బు ఒకే చోట ఉంటే ఇబ్బంది అన్న ఉద్దేశంతో తన నియోజకవర్గంలోని ఆయా మండలాలకు ఇప్పటికే చేరవేసినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత తీసుకుపోయే ప్రతీ రూపాయికి లెక్క చెప్పాల్సి వస్తుంది. అదే ముందుగానే పంపించి వేస్తే ఏ ఇబ్బంది లేకపోవడమే కాకుండా చేరవేసిన డబ్బు పంచడం కూడా సులువు అవుతుందన్న భావనతోనే ఇలా చేసినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ముందుచూపునకు మిగతా నియోజకవర్గ నేతలు నోరెళ్లబెడుతున్నారు.

### ఈ సారి లెక్క గట్టిగానే..

ప్రస్తుతం సామాన్య ప్రజానీకం, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, కూలీలతో సహా అన్ని వర్గాల వారు వైసీపీని వ్యతిరేకిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ గెలుపు అంత సులువు కాదన్న విషయం వైసీపీ నేతలే ఒప్పుకుంటున్నారు. గెలిచేందుకు ఆ పార్టీ నేతలు డబ్బులు గుమ్మరించేందుకు సిద్ధంగా ఉన్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం డబ్బులు ఆయా మండలాలకు పంపించిన నేత విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకత ఇంకాస్త ఎక్కువగా ఉంది. దీనికి తోడు అయనకు టికెట్ ఇచ్చే విషయంలో కూడా వైసీపీ అధిష్ఠానం ఊగిసలాటలో ఉన్నట్లు సమాచారం. అయితే ఎలాగైనా మళ్లీ సీటు తెచ్చుకుని తన స్థానాన్ని కాపాడుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇందులో భాగంగానే తాను ఎన్నికలకు అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నానని తెలియజెప్పేందుకు ఓట్ల కొనుగోలుకు అవసరమైన డబ్బును కూడా సర్దినట్లు సమాచారం.






### అంతా ఇక్కడి నుంచేనా..?

జిల్లాలోని రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉన్న నియోజవర్గం అది. సదరు నేత ఎప్పటి నుంచో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నాడు. డబ్బు బాగానే ఉంది. ఇప్పటి వరకు ఆయన డబ్బుతోనే గెలిచారన్న పేరు ఉంది. ఈసారి కూడా అదే డబ్బుతో ఓటర్లను కొనేస్తే ఓ పనైపోతుందన్న భావనలో ఉన్నట్లు సమాచారం. ఇందుకోసం ముందుగానే తన వ్యాపారంలో వచ్చిన డబ్బును నంద్యాలలోని తనకు వరుసకు సోదరుడయ్యే వ్యక్తి ఇంటికి చేర్చేందుకు సన్నాహాలు చేశాడు. అనుకున్నట్లుగానే డబ్బును నంద్యాలకు చేర్చిన తర్వాత.. ఓ వారం కిందట నంద్యాలకు దగ్గరలోని తన నియోజకవర్గంలోని ఓ మూడు మండలాల్లోని తన మనుషులను రాత్రి సమయంలో తన సోదరుడి ఇంటికి పిలిపించుకున్నాడు. ఇక్కడే నోట్లను లెక్కపెట్టే యంత్రాల సాయంతో ఏ మండలానికి ఎంత మేర అవసరమవుతుందో తెలుసుకుని మరీ వాహనాల్లో తరలించినట్లు తెలుస్తోంది. ఇక నియోజకవర్గ కేంద్రానికి అక్కడే డబ్బులు సర్దినట్లు సమాచారం. ఆ తర్వాత మరో నాలుగు రోజులకు నియోజకవర్గంలోని ప్రముఖ క్షేత్రంగా భావించే మండలానికి మళ్లీ ఇక్కడి నుంచే డబ్బులు సర్దారు. ఈ లెక్క సరిపోకపోతే మళ్లీ సర్దుతామని ఆయా మండల నాయకులకు చెప్పినట్లు సమాచారం. డబ్బులు సర్దిన మాట వాస్తవమే కానీ, అంత పెద్ద మొత్తంలో సర్దలేదని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆయా మండలాల్లోని ముఖ్య నేతలు జారిపోకుండా ముందస్తు తాయిలాల కోసం కొంతమొత్తంలో పంపించారని సదరు నేత అనుచరులు కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కప్పదాట్లు కచ్చితంగా ఉంటాయని, కాబట్టి ఇంత ముందస్తుగా మండల నాయకులకు డబ్బులు ఇచ్చే పని ఎవరూ చేయరని, పంపించిన డబ్బు కచ్చితంగా ఓట్ల పంపకాల కోసమేనని సదరు నాయకుడి అనుచరులే చెప్పుకోవడం గమనార్హం.

### అధికార యంత్రాంగం పట్టించుకుంటే..

ఇంత పెద్దమొత్తంలో డబ్బులను, అది కూడా పట్టణం నడిబొడ్డు నుంచి సదరు నేత తన నియోజకవర్గంలోని ఆయా మండలాలకు పంపించాడనే విషయం పోలీసు వ్యవస్థకు తెలియకుండా ఉంటుందా? లేక అధికార పార్టీ నాయకులతో ఎందుకు లేనిపోని తలనొప్పులు అని పట్టించుకోలేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజులు ఆగితే ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. అపుడు అంతా ఎన్నికల కమిషన్ చేతుల్లోకి వెళుతుంది. అది తెలిసే సదరు నేత తన తెలివితేటలు ఉపయోగించాడని తెలుస్తోంది.. ఆయనను చూసి మిగతా నేతలు కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలకు అడ్డుకట్ట వేసే అవకాశముండదు. అలా కాకుండా ఈ కొద్ది రోజులు జిల్లా యంత్రాంగం, ముఖ్యంగా పోలీసు వ్యవస్థ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే వచ్చే ఎన్నికలు ప్రశాంతంగా జరిగే అవకాశముంటుంది.

# సర్వం శివమయం





- నేటి నుంచి శ్రీశైలంలో
- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

శ్రీగిరిపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఘడియలు మొదలయ్యాయి. మార్చి 8వ తేదీన జరిగే శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మొత్తం 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం శ్రీశైలం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మార్చి ఒకటో తేదీ మొదలుకుని 11వ తేదీ వరకు మల్లన్నకు ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, కల్యాణోత్సవం, రథోత్సవం తదితర వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలను తిలకించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. శ్రీగిరి శిఖరాన శివ భక్తుల 'ఓ నమః శివాయ' పంచాక్షరీ మంత్రం పుణ్యక్షేత్రంలో ప్రతిధ్వనించనుంది.

వివరాలు 7లో...

## నేరుగా ఫోన్ చేయండి: ఎస్పీ



నంద్యాల క్రైం, ఫిబ్రవరి 29 : ప్రజలు తమ సమస్యలపై నేరుగా తనకే ఫోన్ చేయవచ్చని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రజలు పోలీసు స్పందన ఫిర్యాదులపై సమాచారం కోసం, సెంట్రల్ కంప్లైంట్ సెల్ (సీసీసీ) సమాచారం కోసం, శాంతిభద్రతల విషయాల్లోనూ తనతో నేరుగా సంప్రదించవచ్చని అన్నారు. ఇందు కోసం 9154987020 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. బాధితులు తమ సమస్యలపై పిటీషన్లు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, ఉద్యోగం ఇప్పిస్తామనే మోసాలు, బిట్ కాయిన్స్ మోసాలు, లోన్ యాప్‌ల వంటి సైబర్ మోసాలకు గురైనవారు మొదట 1930నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. లేదా సైబర్ క్రైం ప్రభుత్వ వెబ్‌సైట్‌లోగాని, జిల్లా సైబర్ క్రైమ్ విభాగానికి సంబంధించి 9154987034 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ తెలిపారు.

## 4న బనగానపల్లెకు సీఎం

బనగానపల్లె, ఫిబ్రవరి 29 : సీఎం జగన్ ఈనెల 4న బనగానపల్లెకు రానున్నట్లు అధికారవర్గాల నుంచి సమాచారం వచ్చింది. సుమారు రూ.22 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన వంద పడకల బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ప్రారంభించడానికి సీఎం వస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను కలెక్టరు శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో కలసి పరిశీలించారు. అనంతరం కలెక్టరు, ఎస్పీ ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు.

## దివ్యాంగులపై చిన్నచూపు చూస్తున్న జగన్

- రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు
- కర్నూలులో సింహగర్జన సభ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 29: విభిన్న ప్రతిభావంతుల పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దివ్యాంగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆరోపించారు. గురువారం కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వికలాంగుల జేఏసీ ఆధ్వర్యంలో వికలాంగుల సింహగర్జన సభను నిర్వహించారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ అకాల మరణానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విభిన్న ప్రతిభావంతులపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఏ రంగంలోనూ వికలాంగులకు న్యాయం చేయడంలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు పెంచిన రూ. 3 వేల పింఛన్ తప్ప ఈ ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం ఓట్లు వేయించుకోడానికి అనేక హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ. 3 వేలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో చంద్రబాబు వికలాంగులకు మోటర్ బైకులు, వివాహ ప్రోత్సాహకాభివృద్ధికి రూ. లక్ష ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం కళ్లు తెరిచి విభిన్న ప్రతిభవంతుల పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఆర్థిక రుణాలు అందించాలని, బ్యాక్ లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం దక్షిణాది రాష్ట్రాల నాయకుడు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అన్ని రకాలుగా దివ్యాంగులను మోసం చేసిందని అన్నారు. జేఏసీ అధ్యక్షుడు బీసీ నాగరాజు, కడప, అనంతపురం, గుంటూరు జిల్లాల నాయకులు దుర్గారావు, వీరారెడ్డి, శ్రీనివాసులు, జేఏసీ కోశాధికారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు


జనవాహిని మధ్య ఊరేగుతున్న రేణుకా ఎల్లమ్మ రథోత్సవం

## జనసంద్రమైన కోసిగి

### కన్నులపండువగా ఎల్లమ్మ రథోత్సవం



కోసిగి, ఫిబ్రవరి 29: కోసిగి రేణుకా ఎల్లమ్మ రథోత్సవం గురువారం కన్నులపండువగా సాగింది. అమ్మవారి వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో కోసిగి మండల కేంద్రం జనసంద్రంగా మారింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని నైవేద్యంగా కుడుములు, గుగ్గిళ్లు, ఉప్పు, కల్లు, చీర, రవిక కుంభాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదో.. ఉదో తాయీ రేణుకా ఎల్లమ్మ అంటూ భక్తులు భక్తి పరవశించిపోయారు. ఆలయ పూజారులు ఉమేష్‌గౌడు, మల్లయ్యగౌడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం దొరలచావిడి శ్రీనివాస్, గ్రామ పెద్దలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవ వేడుకల్లో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, ఆయన తనయుడు పాలకుర్తి దివాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రదీప్ రెడ్డి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# లీపు శిశువులు

FEBRUARY 29 LEAP DAY

కోసిగి, ఫిబ్రవరి 29: నిజానికి ఫిబ్రవరి 29న పిల్లలను జన్మనివ్వాలని ఏ తల్లి అనుకోదు. ఎందుకంటే పుట్టిన రోజు నాలుగేళ్లకు వస్తుందని ఫీల్ అవుతుంటారు. అయితే ఈ లీపు సంవత్సరంలో కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిబ్రవరి 29న నలుగురు శిశువులు జన్మించారు. ఫిబ్రవరి నెలలో 28 రోజులు మాత్రమే ఉంటాయి.. కానీ నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఫిబ్రవరి నెలలో 29 రోజులు వస్తాయి.. అందుకే ఈ తేదీని లీపు ఇయర్ అంటారు. ఈ అరుదైన రోజున కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో నలుగురు తల్లులు శిశువులకు జన్మనిచ్చారు. వీరిలో ముగ్గురు ఆడ శిశువులు, ఒక మగ శిశువు ఉన్నారు. కోసిగి ఆసుపత్రి డాక్టర్ రజిత, సిబ్బంది రాఘవేంద్ర డెలివరీ చేయించారు. స్పెషల్ డే రోజున పుట్టిన ఈ చిన్నారుల పుట్టిన రోజు వేడుకలు నాలుగేళ్లకు ఒకసారి జరుపుకోవాల్సిందే.


లీప్ ఇయర్ బేబీస్‌తో డాక్టర్ రజిత, ఆసుపత్రి సిబ్బంది రాఘవేంద్ర


లీపు ఇయర్ రోజున పుట్టిన నలుగురు పిల్లలు వీరే...

- కోసిగి ఆసుపత్రిలో నలుగురు జననం
- అరుదైన రోజు ఫిబ్రవరి 29న పుట్టిన పిల్లలు

### ఆరుగురు అమ్మాయిల తర్వాత మగబిడ్డ

కోసిగి మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన రామయ్య, మహాదేవి దంపతులకు వరుసగా ఆరు కాన్పుల్లో ఆడపిల్లలు జన్మించారు. మగ పిల్లాడి కోసం వారు ఎంతగానో వేచి చూశారు. ఏడో కాన్పులో, అందులోనూ లీపు సంవత్సరం, ఫిబ్రవరి 29న మగ శిశువును మహాదేవి జన్మనిచ్చింది. అయితే ఒక్కగానొక్క కుమారుడి పుట్టినరోజు వేడుకలు నాలుగేళ్లకు జరుపుకోవాలని, ఓ వైపు బాధగా ఉన్నా.. అరుదైన రోజు కుమారుడు జన్మించాడని సంతోషంగా ఉందని మహాదేవి ఆనందం వ్యక్తం చేసింది.



## మరింత తగ్గిన వేరుశనగకాయల ధర

- క్వింటా గరిష్ఠంగా రూ. 6,492
- మరో రూ.3 వేలు తగ్గిన వాము


రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ కాయలు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ పంట ఉత్పత్తుల ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటానికి వేరుశనగ కాయలు గరిష్ఠ ధర రూ.6,942, మధ్యస్థ ధర రూ.5,610, కనిష్ఠ ధర రూ.4,010 మాత్రమే పలకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా వారం కింద వాము ధర గరిష్ఠంగా రూ.30వేలు ఉండేది. గురువారం రూ.3వేలు తగ్గిపోయి, గరిష్ఠ ధర రూ.27,100, మధ్యస్థ ధర రూ.14,333, కనిష్ఠ ధర కేవలం రూ.607కు పడిపోయింది. మొక్కజొన్నల ధర క్వింటానికి గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.2,169కు చేరగా.. కనిష్ఠ ధర రూ.1,869కు పడిపోయింది. కందులకు గరిష్ఠ ధర రూ.9,829, మధ్యస్థ ధర రూ.8,911, కనిష్ఠ ధర రూ.1,609కు తగ్గిపోయింది. శనగలకు గరిష్ఠ ధర రూ.5,919, మధ్యస్థ ధర రూ.5,909, కనిష్ఠ ధర రూ.3,010కు పడిపోయింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.1,654, మధ్యస్థ ధర రూ.1,644, కనిష్ఠ ధర రూ.309కు చేరింది. ఎండు మిరపకాయలకు గరిష్ఠ ధర రూ.20,399, మధ్యస్థ ధర రూ.15,959, కనిష్ఠ ధర రూ.1,000కు పడిపోయింది. కొర్రలు గరిష్ఠ ధర రూ.4,039, మధ్యస్థ ధర రూ.4,029, కనిష్ఠ ధర రూ.3,209కు తగ్గింది. మినుముల ధర గరిష్ఠ, మధ్యస్థ ధర రూ.9,171లు, కనిష్ఠ ధర రూ.7,011కు తగ్గింది.

**వ్యాపారులకు హెచ్చరిక:** కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాలు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి రైతులు ఎంతో నమ్మకంతో పంట ఉత్పత్తులను అమ్మకానికి తెస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరను అందించేందుకు వ్యాపారులు చర్యలు తీసుకోవాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. తూకాల్లో ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా ఉండాలని, జీరో వ్యాపారాన్ని ఎవరైనా ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెక్రటరీ గోవిందు హెచ్చరించారు.

## కేఎంసీ ప్రిన్సిపాల్‌గా చిట్టి నరసమ్మ


సుధాకర్ నుంచి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకుంటున్న చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 29: కర్నూలు మెడికల్ కాలేజీ 39వ కొత్త ప్రిన్సిపాల్‌గా డా. చిట్టి నరసమ్మ బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్ డా.పి.సుధాకర్ గురువారం పదవి విరమణ పొందడంతో ఆయన నుంచి సాయంత్రం డా. చిట్టి నరసమ్మ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో 1985-90లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె 1985-98 వరకు అనటామి పీజీ చేసి 1998 అనాటమి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2003లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2008లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2004లో కర్నూలు నుండి అనంతపురానికి బదిలీ అయ్యారు. తిరిగి 2017లో కర్నూలుకు వచ్చారు. 2019 నుంచి వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. 2024 ఫిబ్రవరి 29న ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన వెంకప్ప, చిన్నమ్మ దంపతుల 8వ సంతానం ఈమె. భర్త పేరు నాగరాజు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు శిరీష, ఆమని, శ్రావణి. ఇద్దరు ఎంబీఏ, ఒకరు ఎంటెక్ చదివారు.

## సమాజానికి ఉపయోగపడే రచనలు అవసరం

### క్లస్టర్ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, కళాశాల అధ్యాపకులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 29: సమాజానికి మేలు చేసే రచనలు నేడు అవసరమని, ఆ దిశగా కర్నూలుకు చెందిన చారిత్రక పరిశోధక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని క్లస్టర్ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని బి. క్యాంపులోగల సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల్లో, క్లస్టర్ వర్శిటీ ఆధ్వర్యంలో అజీజ్ రాసిన 'వింధ్య' (రేడియో నాటకాల సంపుటి) పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య సాయిగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాభిలాషను పెంచుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ సాహిత్యం వల్ల సమాజంలోని మంచి చెడులను గుర్తించే అవకాశం ఉందని, విద్యార్థులు సాహిత్య పుస్తకాలు చదవాలని సూచించారు. ప్రత్యేక ఆహ్వానితుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఉర్దూ వర్శిటీ ఆచార్యుడు మహబూబ్ బాషా, సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ చరిత్రకు సంబంధించిన విషయాలతోపాటు సాంఘిక రచనలు చేస్తున్న అజీజ్ రచనలు నేటి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సమావేశంలో రచయిత అజీజ్‌తోపాటూ అడపా శ్రీ సత్య, కళాశాల అధ్యాపకులు పాల్గొని ప్రసంగించారు.

## పాడిపశువుల పెంపకానికి రుణాలు: జేడీ

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: రైతులకు పాడిపశువుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు ఇస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జేడీ రామచంద్రయ్య కోరారు. గురువారం ఆయన నగరంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు, కౌలు రైతులకు పదిహేను రోజుల్లో రుణాలను మంజూరు చేయించేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ద్వారా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.

# బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



- శ్రీగిరిపై నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు
- స్వామివారి అలంకార దర్శనం మాత్రమే
- శివమాలధారులకు 5 వరకు స్పర్శదర్శనం
- ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

శ్రీశైలం, ఫిబ్రవరి 29: శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా గురువారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఉత్సవాల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ ఈఓ డి.పెద్దిరాజు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ప్రతి శాఖతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. పాదయాత్రగా అటవీ మార్గంలో శ్రీశైలం దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా తాగునీరు, అన్నదానం, సేదతీరేందుకు చలువ పందిళ్లు తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. అటవీమార్గంలో 13 చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, అల్పాహారం అందజేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద ఎక్కువ సమయం వేచివుండకుండా ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. అటవీశాఖ పరిధిలో ఉన్న చెక్‌పోస్టుల్లో మార్చి 1 నుంచి 11 వరకు ఎలాంటి రుసుం తీసుకోకుండా వాహనాలను అనుమతించాలని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌ను జేసీ ఆదేశించారు. హఠకేశ్వరం వద్ద రోడ్డుకు ఉన్న దుకాణాలను మార్పు చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రపరిధిలోని టోల్‌గేట్, వలయదారి, యజ్ఞవాటిక, పార్కింగ్ ప్రదేశాలు, మల్లమ్మ కన్నీరు ప్రాంతం, క్యూలైన్లు తదితర వాటిని పరిశీలించి తగు సూచనలను జారీ చేశారు.

- బ్రహ్మోత్సవాల్లో అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. ఒకటో తేదీ నుంచి 5వ తేదీ రాత్రి 7:30 వరకు శివమాలధారులకు మాత్రమే శివలింగ స్పర్శదర్శనం కల్పించనున్నారు.
- ఉత్సవ రోజుల్లో 5 నుంచి 11 వతేదీ వరకు ప్రముఖులకు మూడు విడతలుగా విరామ దర్శనం వేళల్లో మాత్రమే దర్శనం కల్పిస్తారు. ఉదయం 6:30 నుంచి 7:30 వరకు, మధ్యాహ్నం 12:30 నుంచి ఒంటి గంట వరకు, సాయంత్రం 7 నుంచి 7:30 గంటల వరకు వీఐపీలకు దర్శనం ఉంటుంది.


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్

## నందికొట్కూరు వైసీపీలో అంతర్గత ఘర్షణలు


లక్ష్మీచెన్నకేశవ ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

### ఎమ్మెల్యే అనుచరుడిపై సిద్ధార్థరెడ్డి వర్గీయుల దాడి..?

నంద్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గం వైసీపీలో వర్గ విభేదాలు తారా స్థాయికి చేరుతున్నాయి. ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ వర్గం నినాదాలు చేస్తే సిద్ధార్థరెడ్డి వర్గం దాడి చేసినట్లు తెలుస్తోంది. గురువారం పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో లక్ష్మీచెన్నకేశవ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ పూజలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో స్వామివారి దర్శనానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త దార సుధీర్ వెళ్లారు. ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ పూజ నిర్వహించుకుని బయటకు వెళ్తున్న సమయంలో ఆర్థర్ జిందాబాద్, ఆర్థర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ వైసీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సగినెల రమణ నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి అనుచరులు నినాదాలు చేయకుండా వెళ్లాలని సూచించారు. అయితే వారు అలాగే నినాదాలు కొనసాగించడంతో సిద్ధార్థరెడ్డి అనుచరులు సగినెల రమణపై దాడి చేసినట్లు తెలుస్తోంది. గుడిలో నినాదాలు, జిందాబాద్‌లు ఏమిటని పరస్పరం విమర్శలు చేసుకున్నారు. అయితే ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గాల మధ్య విభేదాలు ఉన్నాయని తెలిసి కూడా పోలీసులు ఒకరు పూజ చేస్తుండగా మరొకరిని గుడిలోకి పంపడం వల్లే ఘర్షణ జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరుపై, సిద్ధార్థరెడ్డి వర్గంపై ఫోన్లో ఎస్పీకి ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ ఫిర్యాదు చేశారు.

## నంద్యాల ఆస్పత్రిలో చోరీకి విఫలయత్నం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 29 : నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని దొంగ చోరీకి విఫలయత్నం చేశాడని పోలీసులు గురువారం తెలిపారు. నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సత్వర చికిత్స విభాగంలో గుర్తు తెలియని దొంగ బాత్‌రూమ్ కిటికీని తొలగించి లోపలికి వచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే బాత్‌రూమ్ డోర్‌కు అవతలి వైపు నుండి గడియ పెట్టి ఉండటంతో దొంగ ప్రయత్నం ఫలించలేదు. చేసేదిలేక సదరు దొంగ వచ్చినదారినే వెళ్లిపోయాడు. ఒకవేళ దొంగ ప్రయత్నం ఫలించి ఉంటే పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ విభాగంలో సుమారు రెండుకోట్ల రూపాయల విలువచేసే ఆధునిక యంత్రాలు, మరికొన్ని మెడికల్ పరికరాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ
- హాజరు కానున్న 47,412 మంది
- 69 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు ఆఫీసర్లకు, కస్టోడియన్లకు పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శిక్షణలు ఇచ్చారు. మార్చి 1న ఇంటర్ ప్రథమ సంవత్సరం, 2వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 47,412 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో 22,239 మంది, ద్వితీయ సంవత్సరంలో 25,173 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రతిరోజు పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరగనుంది. అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు టోల్‌ఫ్రీ.నెంబర్08518-222047ను సంప్రదించాలని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69మంది డిపార్టుమెంటు ఆఫీసర్స్, 1650 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌తో అనుసంధానం చేశారు. గురువారం కర్నూలు ప్రభుత్వ టౌన్‌మోడల్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆర్ఐవో గురువయ్యశెట్టి పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అలాగే జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


టౌన్ మోడల్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి

## 'స్కిల్డ్ వేతనాలు వర్తింపజేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**నంద్యాల టౌన్, ఫిబ్రవరి 29:** నంద్యాల పట్టణంలో దాదాపు 20 సంవత్సరాలుగా ఇంజనీరింగ్ విభాగం, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, తదితర విభాగాలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలను వర్తింపజేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మహమ్మద్ గౌస్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ జీవో నంబరు 7 ప్రకారం అర్హత కలిగిన కార్మికులు నంద్యాల మున్సిపాలిటీలో 22 మంది ఉన్నారని చెప్పారు. గతంలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేశారని, అయితే ఆప్కాస్‌కు వివరాలను పంపించే సందర్భంలో అప్పటి కమిషనర్ బదిలీ కావడంతో ఫైల్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. అర్హులైన 22 మందికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అందేలా ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు భాస్కరాచారి, రామకృష్ణ, పవన్, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## 'విధుల్లో అలసత్వం వద్దు'



సచివాలయంలో రికార్డును తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

**గోస్పాడు, ఫిబ్రవరి 29:** సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించవద్దని ఎంపీడీవో నాగ అనసూయ సూచించారు. పసురుపాడు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును, ఎన్‌పీఐ రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ఎంత వరకు జరిగిందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై సచివాలయానికి వచ్చినప్పుడు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కంబగిరి, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'చలో విజయవాడ' వాయిదా సరికాదు: ఏపీటీఎఫ్




తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

**నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 29:** ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం 27న జరగాల్సిన ఛలో విజయవాడ అర్థాంతరంగా జేఏసీ వాయిదా వేయడం సరికాదన్ని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉపాధ్యాయ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 12వ పీఆర్‌సీ 2023 జూలై నుంచి అమలు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. జీవో నంబరు 117ను రద్దు చేయాలని కోరారు. 11వ పీఆర్‌సీ బకాయిలతో పాటు పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లను, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 70 నుంచి 75 మధ్య వయస్సు ఉన్న వారికి 10 శాతం, 75 నుంచి 80 వయస్సు కలిగిన వారికి 15 శాతం చెల్లించాలన్నారు. పాఠశాల నిర్వహణ గ్రాంట్లను విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్, దస్తగిరి, రాములమ్మ, శైలజ, రమేష్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శివ భక్తులకు పండ్లు పంపిణీ

**జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 29:** మండలంలోని తంగడంచ వీరబ్రహ్మేంద్రస్వామి గుడివద్ద ధానధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశైలానికి పాదయాత్ర వెళ్లే భక్తులకు గురువారం పండ్లు, మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈనెల 5వ తేదీ వరకు భక్తులకు అందుబాటులో ఉంటామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ రకాల మెడిసిన్ కూడా ఇస్తున్నట్లు ట్రస్టు సభ్యులు సూర్యనారాయణ, గోకారి తెలిపారు.

## నేటి నుంచి వెంకటాపురంలో అన్నదానం

**ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 29:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లే పాద యాత్రికుల కోసం శుక్రవారం నుంచి శివరాత్రి పర్వ దినం వరకు మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెంకటాపురంలో అన్నదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం గురువారం తెలిపారు. వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత 26 సంవత్సరాల నుంచి ఇక్కడ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మార్చి 1 నుండి 7వ తేది వరకు ఈ అన్నదాన శిబిరాన్ని నిర్వహించడనున్నట్లు తెలిపారు.

### నాగలూటి క్షేత్రంలో..

శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లే భక్తుల కోసం నల్లమల అభయారణ్యంలోని నాగలూటి క్షేత్రంలో శుక్రవారం నుంచి మార్చి 7 వ తేది వరకు పెద్ద దేవళాపురం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీశైల క్షేత్ర పాలకుడిగా భాసిల్లుతున్న నాగలూటి క్షేత్రంలో దాతల ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాల నుండి ఇక్కడ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీశైలం పాదయాత్రగా వెళ్ళే భక్తులు ఈ అన్నదాన శిబిరాన్ని సద్వినియోగించుకోవలసిందిగా నిర్వాహకులు తెలిపారు.



# వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి
- చంద్రబాబు అరెస్టు సమయంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం



మాట్లాడుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



నగదును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**ఆత్మకూరు, ఫిబ్రవరి 29:** టీడీపీ, జనసేన పార్టీలు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన మేనిఫెస్టోలో భాగమైన బాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు టీడీపీ శ్రేణులు బాధ్యతగా వ్యవహరించాలని, వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు ఎంఎం గార్డెన్‌లో శ్రీశైలం నియోజకవర్గంలోని ఆయా మండలాల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా బాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్ని నిలిపివేస్తారని వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అదేక్రమంలో టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తే ఆయా కుటుంబాలకు కలిగే మేలు గురించి వివరించాలని సూచించారు. అనంతరం బూత్ కన్వీనర్లకు బాబు సూపర్ సిక్స్ కిట్లను పంపిణీ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ బన్నూరు రామలింగారెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, కంచర్ల సురేష్, ఉల్లి మధు, నరసింహారెడ్డి, బెంజుమెన్, శేషిరెడ్డి, నాయకులు కలిముల్లా, శ్రీనివాసరెడ్డి, నాగూర్‌ఖాన్, మల్లేశ్వరరెడ్డి, అబ్దుల్లాపురం బాషా, మనోహర్, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు తదితరులు ఉన్నారు.

**మహానంది:** టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుతో గుండెపోటుకు గురై మృతి చెందిన మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన కార్యకర్త మద్దిలేటి కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల ఆర్థి సాయాన్ని అందజేశారు. నారా భువనేశ్వరి పంపించిన ఈ ఆర్థిక సాయాన్ని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అందచేశారు. గురువారం ఆత్మకూరు పట్టణంలో జరిగిన టీడీపీ సమావేశంలో వేదికపై మద్దిలేటి భార్య అనంతమ్మకు అందజేశారు. నాయకులు కంచెర్ల శివ, వేమూరి కేశవరావు, గుద్దేటి నాగరాజు, మారెడ్డి సుబ్రమాణ్యం, శివలు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం సభతో వైసీపీలో వణుకు: బుడ్డా

**ఆత్మకూరు, ఫిబ్రవరి 29:** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేంలో జరిగిన తెలుగు జన విజయకేతనం జెండా సభతో వైసీపీలో వణుకు మొదలైందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. ఈసందర్భంగా గురువారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన తలపెట్టిన జెండా సభ వైసీపీలో గుబులు రేపుతోందని అన్నారు. సభకు హాజరైన జనాన్ని చూసి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే బెంగళూరులోని తన ప్యాలెస్‌కు రంగులు వేయిస్తున్నట్లు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోగానే రాష్ట్రాన్ని వదిలేందుకు సీఎం జగన్ సిద్ధమవుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రసంగాలు యావత్ రాష్ట్ర ప్రజలందరు నీరాజనాలు పలుకుతున్నారని గుర్తుచేశారు. అయితే స్క్రిప్ట్ చూసి కూడా సీఎం జగన్ సభల్లో సరిగా చదవలేని పరిస్థితికి దిగజారారని అన్నారు. ఇప్పటికే జనాన్ని భయపెట్టి, ప్రలోభపెట్టి సిద్ధం సభకు తరలిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తించుకోవాలని హితవుపలికారు. వాపును చూసి బలుపు అనుకుంటున్న వైసీపీకి అంతిమఘడియలు దగ్గరపడ్డాయని, కొద్దిరోజుల్లోనే రాష్ట్రానికి పట్టిన వైసీపీ గ్రహణం వీడనుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి జగన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్ర భవిష్యత్తే ప్రశ్నార్థకం అవుతుందన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు.

## పాముకాటుకు గురైన వ్యక్తి మృతి

**జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 29:** మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (58) అనే వ్యక్తి పాముకాటుకు గురై చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. శ్రీనివాసులు గత నాలుగురోజుల క్రితం కల్లం వద్ద కాపలా ఉండగా పాముకాటు వేసిందని, దీంతో కుటుంబ సభ్యులకు తెలిపి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందారని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రేపు జాబ్ మేళా

**నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 29:** నంద్యాల జిల్లాలోని 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. కమిషనర్ కళాశాలల విద్యాశాఖ, జవహర్ నాలెడ్జి సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాను కేవలం నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రమేనని ఆమె చెప్పారు. దాదాపు 24 కంపెనీల ప్రతినిధులు వస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్లను కళాశాలలో విడుదల చేశారు. జేకేసీ కోఆర్డినేటర్ పార్వతి, ప్రతాప్‌రెడ్డి, మహబూబ్ బాషా, గురువయ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఒకరికి తీవ్ర గాయాలు

**కొత్తపల్లి, ఫిబ్రవరి 29:** మండలంలోని దుద్యాల గ్రామ సమీపంలో కుమ్మరికుంట మలుపు వద్ద గురువారం ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనం, స్కూటర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదం లో పాములపాడు మండలం లింగాల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం బంధువుల గృహ ప్రవేశం ఉండటంతో ఆత్మకూరుకు బైక్‌పై తన కూతురు శ్రీదేవితో కలిసి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మలుపు వద్ద ఆత్మకూరు నుంచి దుద్యాలకు ఓ మహిళ వెళ్తున్న స్కూటర్, బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయాలైన శేఖర్ రెడ్డిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు స్థానికులు తరలించారు.

## 'తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి'

**నందికొట్కూరు ఫిబ్రవరి 29:** వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోకి కిసాన్ పార్కులో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో తలెత్తుతున్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు. కేసీ కాలువలో నీరు ఉన్నప్పుడు మాత్రమే నందికొట్కూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు నీటితో నింపుతున్నారని, దీని వల్ల కేసీ కాలువలో నీరు ఎక్కువ రోజులు ఉండడం లేదన్నారు. కావున హంద్రీనీవా సృజల స్రవంతి కాలువ నుంచి కూడా ఎస్.ఎస్.ట్యాంక్‌లోకి నీటిని నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను సూచించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## 'రైతులకు న్యాయం చేయాలి'



ధర్నాలో పాల్గొన్న సంఘాల నాయకులు, రైతులు

**నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 29:** పాణ్యం మండలం ఆలమూరు నుంచి కందికాయ పల్లె, కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167 హైవే రోడ్‌లో భూములు కోల్పోతున్న రైతులకు భూ సేకరణ చట్టం అమలు చేసి, రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ బాధిత రైతులకు అండగా వుంటామన్నారు. అధికారులు రైతులతో చర్చించి పరిష్కారం చేయని పక్షంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలను సమీకరించి కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని అధికారులను హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయకపోతే సోలార్ పనులను అడ్డుకుంటామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆఫీసు కార్యాలయ ఏవోకు రైతులు వ్యక్తిగత అర్జీలు, వినతి పత్రాలు సమర్పించారు. ఆలమూరు, కందికాయపల్లె, పిన్నాపురం, కొత్తపల్లి మండలం సింగరాజు పల్లె, బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె, ఎ.కోడూరు, బండిఆత్మకూరు, బిల్లలాపురం, చింతకుంట తదితర గ్రామాలనుంచి రైతులు, మహిళలు, రైతు సంఘం నాయకులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## కమనీయం ఆత్మలింగేశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణ క్రతువులో కొలువుతీరిన ఉత్సవమూర్తులు

**ఆత్మకూరు, ఫిబ్రవరి 29:** ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో వున్న ఆత్మలింగేశ్వరుడి ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవ క్రతువు కమనీయంగా సాగింది. ఈ వేడుకలో భాగంగా గురువారం ఉదయం ఆత్మలింగేశ్వరుడి ఆలయంలో గోపూజ, గణపతిపూజ, లఘున్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించారు. తదుపరి మహామంగళహారతిని స్వామివారికి నివేదించారు. లోకకళ్యాణార్థం రాత్రి 8గంటల ప్రాంతంలో ఆత్మలింగేశ్వరుడి ఆలయం ఎదుట శ్రీపార్వతీ పరమేశ్వర ఉత్సవమూర్తులను కొలువుతీర్చి కళ్యాణ క్రతువును ఆరంభించారు. స్వామి, అమ్మవార్ల తరుపున దంపతులు పెద్దలుగా వ్యవహరించి సంప్రదాయబద్ధంగా కన్యాదానం, యజ్ఞోపధారణ, శిరస్సున జిలకరబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలను జరిపించారు. కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని గావించిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం రాత్రి 9గంటల సమయంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా విచ్చేసిన భక్తులకు రాత్రి అల్పాహార వితరణను ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. కాగా ఈ వేడుకలను తిలకించేందుకు ఆత్మకూరు ప్రాంతంలోని శివస్వాములు, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

## మున్సిపల్ భూమి 'హాంఫట్' పై రగడ

- రాజకీయ పలుకుబడితో కబ్జా చేస్తుంటే ఏం చేస్తున్నారు..?
- కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు



నిలదీస్తున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలి

**నంద్యాల టౌన్, ఫిబ్రవరి 29:** నంద్యాల మున్సిపల్ పరిధిలోని మున్సిపాలిటీకి చెందిన దాదాపు రూ.50 కోట్లు విలువ చేసే మున్సిపల్ స్థలాన్ని హాంఫట్ చేయడంపై కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. గత నెల 11వ తేదీన మున్సిపాలిటీకి చెందిన "రూ.50 కోట్ల భూమి హాంఫట్" శీర్షికన తెరవెనుక భారీ లాబియింగ్‌తో ఒకే రోజు 43 రిజిస్ట్రేషన్‌లను ఎనీవేర్ రిజిస్ట్రేషన్ సిస్టమ్‌తో నంద్యాల మున్సిపాలిటీకి చెందిన భూమిని బేతంచెర్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమార్కులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన జరిగింది. టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలి మాట్లాడుతూ మున్సిపల్ భూమిని రాజకీయ పలుకుబడితో అక్రమార్కులు దర్జాగా కబ్జాకు పాల్పడుతుంటే అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణితో నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఖరీదైన మున్సిపల్ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న విషయంపై మున్సిపల్ అధికారులు ఇస్తున్న వివరణలు సరిగ్గాలేవని అన్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, ఆదేశాలు రావాలని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. అదే మీ సొంత స్థలాన్ని ఎవరైనా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి క్రిమినల్ కేసులు నమోదులు చేస్తారని, మున్సిపల్ స్థలాన్ని అక్రమార్కులు రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే వారిపై పోలీస్ స్టేషన్‌లో ఎందుకు కేసు నమోదు చేయడంలేదని ప్రశ్నించారు. అధికార పక్షానికి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, స్వతంత్ర కౌన్సిలర్ కండే శ్యామ్‌సుందర్‌లాల్ కూడా మున్సిపల్ భూమి హాంఫట్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. మున్సిపల్ ఆస్తులను కాపాడేందుకు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన ఒక్క సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత కౌన్సిల్‌పై ఉందని అన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో తన పాత్రలేదని, ఏలాంటి తప్పు చేయలేదని, ఆరోపణల విషయంలో తనపై మచ్చ ఉన్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని పేర్కొన్నారు. కమిషనర్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీలోని మున్సిపల్ స్థలం అన్యాక్రాంతం విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి నరసింహ మూర్తి మాట్లాడుతూ పత్రికల్లో మున్సిపల్ భూమి ఆక్రమణ విషయంపై కథనాలు వచ్చేంత వరకు తమకు తెలీయదని, తదుపరి చర్యలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీసుకుంటామని పేర్కొన్నారు.

### శ్వేత పత్రం విడుదలపై ప్రశ్నించని దేశం సులోచన:

నంద్యాల మున్సిపాలిటీలో ఏడాదిన్నర కాలంగా ఆర్థిక లావాదేవీల్లో అక్రమాలపై అధికార వైసీపీకి చెందిన 18వ కౌన్సిలర్ దేశం సులోచన జనవరి నెలాఖరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు. 15 రోజుల్లోనే శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని చైర్‌పర్సన్‌ను నిలదీశారు. అయితే ప్రస్తుత కౌన్సిల్ సమావేశంలో గత సమావేశంలో లేవనెత్తిన వివిధ అంశాలపై శ్వేత పత్రం విడుదల ఏమైందని ప్రశ్నించాల్సిన దేశం సులోచన ఎలాంటి ప్రశ్నలు వేయకుండా మౌనంగా కూర్చోవడం హాట్ టాపిక్‌గా మారింది. గత కొద్ది రోజులుగా మున్సిపాలిటీ కేంద్రంగా జరుగుతున్న వివిధ పరిణామాల నేపథ్యంలో వైసీపీ ముఖ్య నాయకులు రంగ ప్రవేశం చేయడంతోనే దేశం సులోచన ఎలాంటి ప్రశ్నలు వేయకుండా నిలదీయలేదని స్పష్టమవుతోంది. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణదాతకు బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నంద్యాలలో కల్యాణదాతకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో

**మహానంది, ఫిబ్రవరి 29:** మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని దేవస్థానం ఏర్పాటు చేస్తున్న కళ్యాణానికి దాతగా వ్యవహరిస్తున్న నంద్యాలకు చెందిన లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులకు గురువారం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. కొన్ని సంవత్సరాల నుంచి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానందిలో జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణానికి ప్రసాద్ దంపతులు దాతలుగా వ్యవహరిస్తున్నట్లు ఈవో తెలిపారు. అలాగే నంద్యాల్లోని మరి కొందరు దాతలకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను ఈవోతో పాటు వేదపండితులు రవిశంకర్ అవధాని, ఏఈవో వెంకటేశ్వర్లు అందజేశారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ



పెసరవాయి గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

**గడివేముల, ఫిబ్రవరి 29:** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పెసరవాయి, చిందుకూరు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అనంతరం ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, గ్రామాల్లో అల్లర్లు పాల్పడవద్దని ఆదేశించారు. గ్రామాల్లో నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దేవస్థానానికి బంగారు కానుకలు



ఆభరణాలను అందజేస్తున్న భక్తులు

**శ్రీశైలం, ఫిబ్రవరి 29:** శ్రీశైలం దేవస్థానానికి గురువారం చిలకలూరిపేటకు చెందిన ఎన్. రమేష్‌బాబు, కోటేశ్వరరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు రాళ్ళతో కూడిన బంగారు హారం, కమ్మలను సమర్పించారు. వీటిని 79 గ్రాములతో బంగారు హారాన్ని, 8 గ్రాములతో కమ్మలను చేయించినట్లు భక్తుడు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఈ బంగారు ఆభరణాలను అమ్మవారి ప్రధానార్చకులు పి.ఉమానాగేశ్వరశాస్త్రి, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

## ఆటో గ్యారేజ్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళ సిబ్బంది

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 29:** నంద్యాల పట్టణంలోని బిస్మిల్లా ట్రాక్టర్, డోజర్, హార్వెస్టర్ ఆటోగ్యారేజ్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్యారేజ్‌లోని వస్తువులన్నీ కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. బిస్మిల్లా ఆటోగ్యారేజ్ యజమాని సలామ్ ప్రమాద తీరును వివరిస్తూ బోరున విలపించారు. దాదాపు రూ.5లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.

## 'రాష్ట్రంలో దోపిడీ పాలన'

**నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 29:** రాష్ట్రంలో దోపిడీ పాలన కొనసాగుతోందని, మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే మీ ఆస్తులకు వారసుడు జగన్ మోహన్‌రెడ్డి అవుతారని బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల్లో చేపట్టిన ప్రజా పోరు యాత్ర గురువారం ముగిసింది. సాయిబాబానగర్, ఆర్‌ఆర్ హోటల్, యస్‌బిఐ కాలనీ, గిరినాథ్ సెంటర్, నూనెపల్లె తదితర ప్రాంతాల్లో యాత్ర నిర్వహించారు. నండే ఎమ్మెల్యే మాకోద్దు అని ఒక ఓటరు లెటర్ ద్వారా అభిప్రాయం చేప్పారని గుర్తు చేశారు. విశ్వకర్మయోజన పథకం చేతి వృత్తులు వారికోసం బీజేపీ ప్రభుత్వం క్యాలెండర్లు ముద్రిస్తే నంద్యాల లోని వైసీపీ వార్డ్ ఇన్‌చార్జిలు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అంటూ బీజేపీ క్యాలెండర్ చూపిస్తున్నారన్నారు. మేడా మురళి, గురబ్రహ్మ, కశెట్టి చంద్రశేఖర్, మధుర శ్రీవాణి, స్వాతి, రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినుల ప్రతిభ

**పాణ్యం, ఫిబ్రవరి 29:** మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు పేపర్ ప్రజంటేషన్‌లో ప్రతిభ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 28న కర్నూలు కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్రైట్స్ 2క24 జాతీయ సాంకేతిక సదస్సులో ఈసీఈ విభాగానికి చెందిన ఎస్. నజియా, ఎస్. వైష్ణవి ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్లాస్టిక్ కండక్టింగ్ ఎలక్ట్రిసిటీ అనే అంశానికి బహుమతి పొందినట్లు తెలిపారు. విద్యార్థినులను ఎండీ శివరాం, హెచ్‌ఓడీ డాక్టర్ మల్లికార్జునరావు, కోఆర్డినేటర్ శంకర్‌నాథ్ అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎక్స్‌కవేటర్‌కు నిప్పు

**దొర్నిపాడు, ఫిబ్రవరి 29:** మండలంలోని చాకరాజువేముల నుంచి డబ్ల్యూ గోవిందిన్నెకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న ఎక్స్‌కవేటర్‌కు బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. రోడ్డు మరమ్మతు పనుల నిమిత్తం ఉంచిన ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టారు. లింగందిన్నె గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి ఎక్స్‌కావేటర్‌ను కాంట్రాక్టర్ శివరామిరెడ్డి బాడుగకు తీసుకొని రోడ్డు పనులు చేయిస్తు న్నారు. ఎక్స్‌కావేటర్‌కు నిప్పు పెట్టారన్న సమాచారంతో గురువారం నీటి పారుదల సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పరిశీలించారు. నిప్పు పెట్టిన వారిని వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, దొర్ని పాడు ఎస్ఐ సురేష్‌లకు ఆదేశించారు. వీరి వెంట కాంట్రాక్టర్ శివరా మిరెడ్డి, భూమా చెంచిరెడ్డి, బత్తుల నాగేశ్వరయాదవ్ ఉన్నారు.

# నేడు డోన్‌లో కోట్ల బహిరంగ సభ

● భారీగా తరలిరానున్న తెలుగు తమ్ముళ్లు ● విజయవంతం చేయాలని కోట్ల రాఘవేంద్ర రెడ్డి పిలుపు




మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి, టీఈ కేశన్నగౌడును కలిసిన ఎర్రగుంట్ల టీడీపీ నాయకులు

**డోన్, ఫిబ్రవరి 29:** డోన్ పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తున్న టీడీపీ భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించిన తర్వాత.. మొదటి సారిగా డోన్‌కు వస్తుండటంతో ఆయనకు భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాల నాయకులు ఈ సభకు తరలిరానున్నారు. దీంతో డోన్‌లో ఎక్కడా చూసినా తెలుగు త మ్ముళ్ల సందడి కనిపిస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల చేసిన టీడీపీ అభ్యర్థుల మొదటి జాబితాలో డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్న గౌడు, మర్రి రమణ, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, డోన్, ప్యాపిలి, బేతం చెర్ల మండలాల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, గండికోట రామ సుబ్బయ్య, ఎల్లనాగయ్య, ఓంప్రకాష్, ఎరుకల చెరువు శివ, మాజీ ఎంపీ టీసీ బుగ్గన ప్రసన్నలక్ష్మి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పోలూరు వెంక టేశ్వరరెడ్డి ఏర్పాట్లు చూస్తున్నారు. గుత్తి రోడ్డులోని అమ్మ హోటల్ సర్కిల్ నుంచి పాతబస్టాండు మీదుగా మధు ఫంక్షన్ హాలు వరకు ర్యాలీ నిర్వహించనున్నారు.

● **జిల్లా టీడీపీ నాయకుల రాక:** పట్టణంలో నిర్వహించే టీడీపీ బహిరంగ సభకు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఉమ్మడి జిల్లాల టీడీపీ నాయకులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. దీంతో జిల్లా టీడీపీ నాయకులు భారీగా తరలివస్తున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, ఎన్ఎండీ ఫరూక్, భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు తరలివస్తున్నారు.

● **టీడీపీ సభను విజయవంతం చేద్దాం..**

టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోట్ల రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశమై టీడీపీ అధినేత చంద్రబాబు ఎంతో నమ్మకంతో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ప్రకటించారన్నారు. సమన్వయంతో సభ విజయవంతమయ్యేలా చూడాలన్నారు.

## వైసీపీ పతనం ఖాయం: మాజీ మంత్రి



టీడీపీలో చేరిన వారితో భూమా అఖిలప్రియ

**రుద్రవరం, ఫిబ్రవరి 29:** వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని చిలకలూరు గ్రామంలో గురువారం మాజీ మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఈ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చేయకుండా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో రాక్షసపాలన తప్ప ప్రజా సంక్షేమం ఎక్కడ జరిగిందని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రులు రాక్షసపాలనలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని సవాల్ విసిరారు.

**టీడీపీలో చేరిక:** చిలకలూరు గ్రామంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో వన్నూరుబాషా, మహ్మద్‌హుసేన్, భూమ్మగారి చిన్నపకీరా, శిరివెళ్ల అబ్దుల్ హుసేన్, ముల్లబాషా, ముల్ల అమీర్, శిరివెళ్ల మంజుల, ముల్ల బ్రదర్స్ మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి అఖిలప్రియ టీడీపీ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో భార్గవరామ్‌నాయుడు పాల్గొన్నారు.

## కోట్ల గెలుపు ఖాయం: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య

**బేతంచెర్ల, ఫిబ్రవరి 29:** డోన్ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి గెలుపు ఖాయమని టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య ధీమా వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ల నాగయ్య మాట్లాడుతూ శుక్రవారం డోన్‌లో జరగనున్న టీడీపీ సభను విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ జాకిరుల్లాబేగ్, భీమేశ్వరరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు ఫయాజ్ హుసేన్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నేనావత్ రవీంద్ర నాయక్, తెలుగు యువత అధ్యక్షుడు మర్రికుంట మాధవ్ పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు

**శిరివెళ్ల, ఫిబ్రవరి 29:** మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. శిరివెళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిపి మొదటి సంవత్సరంలో 190 మంది, ద్వితీయ సంవత్సరంలో 160 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రం గ్రామీణ ప్రాంతంలో ఉన్నందున విద్యార్థులు నిబంధనలకు అనుగుణంగా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

**చాగలమర్రి:** చాగలమర్రి గ్రామంలోని వాసవీ ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో 539 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం 266 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 273 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు రాసేందుకు 12 గదులను విద్యార్థుల కోసం ఏర్పాటు చేశామని చెప్పారు. 16 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఇంటర్ ప్రశ్నా పత్రాలను పోలీసు స్టేషన్‌లో భద్రపరిచామని చెప్పారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు నిర్వహిస్తారని అన్నారు. విద్యార్థులు పరీక్షా సమయాన్ని పాటించాలని సూచించారు.

## మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

**శిరివెళ్ల, ఫిబ్రవరి 29:** శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు నేషనల్ సైబర్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం గురువారం తెలిపారు. మోడల్ స్కూల్‌లో జనవరిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో 146 మంది పాల్గొనగా 46 మంది విద్యార్థులు నగదు బహుమతులు సాధించారన్నారు. ఇందులో ఎల్ ఎస్ నూర్ మహమ్మద్, నాగ చరణ్‌లు రూ.5 వేలు చొప్పున, డీ రైన్, అర్షు న్‌లు రూ.2,500 చొప్పున నగదు బహుమతి పొందారన్నారు. టాలెంట్ టెస్ట్‌లో రాణించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం

**ప్యాపిలి, ఫిబ్రవరి 29:** చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగు తుందని టీడీపీ యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి, పీఆర్‌పల్లి గ్రామాల్లో ఆయన కార్యకర్తలతో మా ట్లాడారు. వైసీపీ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన ఆ పార్టీని ఇంటికి పంపడం ఖాయమన్నారు. డోన్‌లో నిర్వహించనున్న టీడీపీ సభకు భారీగా తరలి రావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం చంద్రపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయ కులు శ్రీనివాసులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

## బనగానపల్లె సీఐగా గంటా సుబ్బారావు

**బనగానపల్లె, ఫిబ్రవరి 29:** బనగానపల్లె పట్టణ సీఐగా గంటాసుబ్బారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బనగానపల్లె పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ కావ డంతో మరో సీఐ పోస్టు అవసరం కావడంతో బనగానపల్లె రెండో సీఐగా గంటా సుబ్బారావును నియమించారు. ఈయన ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేసేవారు.

## అదనపు మండల విద్యాధికారికి సన్మానం

**డోన్(రూరల్), ఫిబ్రవరి 29:** పదవీ విరమణ పొందిన డోన్ మండల అదనపు విద్యాధికారి రాజేశ్వరికి డోన్ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో గురువారం సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ప్రభాకర్ హాజరై రాజేశ్వరి సేవలను కొని యాడారు. అనంతరం ఆమెను పూలమాలలు, దుశ్శాల వలతో సత్కరించారు. ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

**బనగానపల్లె, ఫిబ్రవరి 29:** బనగానపల్లె పట్టణంలోని ఎస్సార్బీసీ కాల్వ సమీపంలో నిర్మించిన క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాటసాని తిరుపాల్‌రెడ్డి, రవికుమార్, వేణుగోపాల్, డాక్టర్ రవి కుమార్, వెంకటసు బ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయకత్వం చారిత్రక అవసరం

టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



కోట్లను గజమాలతో సత్కరిస్తున్న కేశవభట్ సోదరులు

**డోన్, ఫిబ్రవరి 29:** రాష్ట్ర ప్రజలను వైసీపీ కబంధహస్తాల నుంచి కాపాడేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వం చారిత్రక అవసరమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం కర్నూలులోని కోట్ల నివాసంలో మాజీ ఉప సర్పంచ్ కేశవభట్, ప్రకాష్‌భట్, సీనియర్ న్యాయవాది శ్రీనివాసభట్, కామిశెట్టి చైతన్య, గురురాజ్‌భట్, రంగస్వామి, శ్రీనివాసులరెడ్డి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గజమాలతో సత్కరించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని సీఎం జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఈవిషయంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. డోన్‌లో శుక్రవారం నిర్వహించే టీడీపీ ఆత్మీయ సభలో నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

## 'చంద్రబాబుతోనే పేదల సంక్షేమం'

**దొర్నిపాడు, ఫిబ్రవరి 29:** రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని, రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. గురువారం దొర్నిపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి ఇంటింటికి వెళ్లి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. బీసీ, ఎస్టీ కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు భూమా జగత్‌ను కోరారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భూమా సందీప్‌రెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి, ఏరువ ప్రసాదురెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సిద్ధి సత్యం, సిద్ధి నారాయణ, నాయన గారి శ్రీనివాసులు, అమరసాని రవి, కేదాటి బాలస్వామి, అమరసాని శేఖర్, లింగుట్ల వెంకట్‌నాయుడు, చౌదయ్య, తోట సంజీవ, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## నేడు టీడీపీ కార్యవర్గ సమావేశం

**బనగానపల్లె, ఫిబ్రవరి 29:** స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈసమావేశానికి నియోజవకర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన టీడీపీ క్లస్టర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు టీడీపీ నాయకులు భారీఎత్తున తరలిరావాలని కోరారు.

## హెచ్ఐవీ బాధితులకు రక్త పరీక్షలు

**బనగానపల్లె, ఫిబ్రవరి 29:** పట్టణంలోని ఏరియా ప్రభుత్వవైద్యశాలలో గురువారం హెచ్ఐవీ బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రోగ్రాం మేనేజర్ ఆలీహైదర్ తెలిపారు. సూపరింటెండెంట్ సుజాత ఆధ్వర్యంలో బాధితులకు పరీక్షలు నిర్వహించారు.

# జగన్ ప్యాలెస్‌లో ప్రకంపనలు: మాజీ ఎమ్మెల్యే బీసీ



మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

**బనగానపల్లె, ఫిబ్రవరి 29:** తాడేపల్లె గూడెంలో టీడీపీ-జనసేన పొత్తుతో నిర్వహించిన సభతో తాడేపల్లె ప్యాలెస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అవినీతి, అక్రమాలు వేధింపులు, కబ్జాలకు వ్యతిరేకంగా టీడీపీ-జనసేన పార్టీలు పోరాడుతున్నాయన్నారు. టీడీపీ-జనసేన పార్టీలు చేతులు కలిపింది తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, 5 కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. జగన్ రాష్ట్రాన్ని విధ్వంసం దశకు తీసుకెళ్లారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి ఆ మృతదేహాన్ని వారింటికే డోర్ డెలివరీ చేశారన్నారు. టీడీపీ అన్నా క్యాంటీన్‌లు తెరచి పేదలకు రూ.5కు భోజనం పెడితే వాటిని మూయించి పేదల కడుపు కొట్టారని విమర్శించారు. కరోనా సమయంలో పేస్‌మాస్కు అడిగినందుకు దళిత వైద్యుడు సుధాకర్‌ను మానసిక వికలాం గుడిగా ముద్రవేసి చంపార న్నారు. వైసీపీ వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెట్ ప్లేయర్ హనుమ విహారి పారియోయారన్నారు. వైనాట్ 175 అని జగన్ అంటున్నారని. అసలు వైపీపీకీ ఎందుకు ఓటువేయాలి అని అడుగుతున్నాం. ఆయన ఏం సాధించారన్నారు. జాబ్ క్యాలెండర్ లేదు. డీఎస్సీ లేదు. ఉచిత ఇసుక లేదు అసలు వైసీపీకీ ఎందుకు ఓటువేయాలని బీసీ ప్రశ్నించారు. వైనాట్ 175 కాదు వైనాట్ పులివెందుల అని బీసీ అన్నారు. పులివెందులలో జగన్‌కు ఓటమి తప్పదన్నారు.

## టీడీపీతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు



మాట్లాడుతున్న ఆలా మోహన్ రెడ్డి

**డోన్(రూరల్), ఫిబ్రవరి 29:** టీడీపీ, జనసేన కూటమితో రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు లభిస్తుందని జనసేన డోన్ నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి డోన్‌కు రానున్నారని, ఇందులో భాగంగా కోట్ల చేతుల మీదుగా జనసేన పార్టీ కార్యాలయం అధికారికంగా ప్రారంభిస్తారని, జనసైనికులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పరదేశి మహేష్, వసంత్, ప్రదీప్ కుమార్, రాయల్ శ్రీను పాల్గొన్నారు.

## దొర్నిపాడు ఎస్ఐగా సురేష్

**దొర్నిపాడు, ఫిబ్రవరి 29:** దొర్నిపాడు మండల ఎస్ఐగా బి.సురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన తిరుపాల్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో కర్నూలు నుంచి బి.సురేష్ బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ

**ప్యాపిలి, ఫిబ్రవరి 29:** గత ఏడాది మండలంలోని రామరత్నగిరి గ్రామంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని జలదుర్గం పోలీసు స్టేషన్‌లో నిందితుడిని విలేకర్ల సమావేశంలో హాజరు పరిచిన సీఐ సుధాకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మండలంలోని రామరత్నగిరిలో గత ఏడాది నవంబరు 23న సున్నపు రాముడు ఇంట్లో 6 తులాల బంగారం అపహరణకు గురైంది. ఈ చోరీ బనగానపల్లి మండలం యనగండ్ల గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం చేశాడని గుర్తించామని తెలిపారు. నిందితుడిని మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జలదుర్గం ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్స్‌కవేటర్‌కు నిప్పు

**దొర్నిపాడు, ఫిబ్రవరి 29:** మండలంలోని చాకరాజువేముల నుంచి డబ్ల్యూ గోవిందిన్నెకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న ఎక్స్‌కవేటర్‌కు బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. రోడ్డు మరమ్మతు పనుల నిమిత్తం ఉంచిన ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టారు. లింగందిన్నె గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి ఎక్స్‌కావేటర్‌ను కాంట్రాక్టర్ శివరామిరెడ్డి బాడుగకు తీసుకొని రోడ్డు పనులు చేయిస్తున్నారు. ఎక్స్‌కావేటర్‌కు నిప్పు పెట్టారన్న సమాచారంతో గురువారం నీటి పారుదల సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పరిశీలించారు. నిప్పు పెట్టిన వారిని వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, దొర్నిపాడు ఎస్ఐ సురేష్‌లకు ఆదేశించారు. వీరి వెంట కాంట్రాక్టర్ శివరామిరెడ్డి, భూమా చెంచిరెడ్డి, బత్తుల నాగేశ్వరయాదవ్ ఉన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**చాగలమర్రి, ఫిబ్రవరి 29:** మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన మహేశ్వరి (30) చికిత్స పొందుతూ మృతి చెందారు. మహేశ్వరి తన నివాసంలో బుధవారం ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. మూడు నెలలుగా మతిస్థిమితం సరిగా లేక జీవితంపై విరక్తి చెంది నిప్పంటించుకున్నారు. అయితే కోలుకోలేక మృతి చెందారు. మహేశ్వరి భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

## అహోబిలం చేరిన ఉత్సవ పల్లకి

**నంద్యాల ఫిబ్రవరి 29, (ఆంధ్రజ్యోతి):** అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకిలోని ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాద వరదస్వామి ప్రజలతో పూజలందుకొని ద్విగ్విజయంగా అహోబిలం గ్రామాన్ని గురువారం చేరుకున్నారు. అహోబిలం గ్రామ ప్రజలు, వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు ఉత్సవ మూర్తులకు లఘు సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి వారి స్థానాలలో వారిని కూర్చొబెట్టారు. జనవరి 16వ తేదిన అహోబిలం గ్రామం నుంచి బయలు దేరిన ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల్లోని 34 గ్రామాల్లో 42 రోజుల పాటు పర్యటించి గ్రామాల్లోని తెలుపుల వద్ద విడిది చేసి కులమతాలకు అతీతంగా పూజలందుకున్నారు. మార్చిలో చెంచులక్ష్మీ అమ్మవారితో జరిగే తన కల్యాణానికి తప్పకుండా రావాలన్న పిలుపుతో ఉత్సవ పల్లకిలో బయలుదేరిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ పల్లకి పర్యటన ద్విగ్విజయంగా ముగించుకొని అహోబిలం గ్రామానికి చేరుకున్నారు.



అహోబిలంలో పార్వేట ఉత్సవ పల్లకి

## ఉరుసు వేడుకలు ప్రారంభం

**అవుకు, ఫిబ్రవరి 29:** మండలంలోని కునుకుంట్ల సమీపంలో వెలసిన పాంషావలి ఖాదరీబాబా(టెక్కెస్వామి) ఉరుసు వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. గురువారం గంధం, శుక్రవారం ఉరుసు, శనివారం జియారత్ నిర్వహించనున్నారు. కునుకుంట్ల టీడీపీ నాయకులు గూడాల శివరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పీఠం నుంచి ముస్లిం మతపెద్దలు మేళతాళాలతో ఫక్కీర్‌ల ఆధ్వర్యంలో గంధో త్సవం నిర్వహించారు.

## పోలీసుల గ్రామ సభలు

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 29:** మండలంలోని బిజనవేముల, వెలగటూరు, రేవనూరు, గ్రామాల్లో సీఐ జయచంద్ర, ఎస్ఐలు వరప్రసాద్, రామ్మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం రాత్రి గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో అవాం ఛనీయ సంఘటలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

**బేతంచెర్ల, ఫిబ్రవరి 29:** నగర పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని నగర పంచాయితీ చైర్మన్ చలంరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నగర పంచాయితీ కార్యాయలంలో వార్డు కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం కమిషనర్ రమేష్‌బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో జరిగే వివిధ అభివృద్ధి పనులపై సభ్యుల తీర్మాణాల కోసం అజెండాలను చదివి వినిపించారు. పట్టణంలోని డోన్, బనగానపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్మశానానికి నీటి సరఫరా చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ సభ్యులు ఎల్లయ్య చైర్మన్ దృష్టికి తెచ్చారు. వార్డు కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 'కేంద్ర పథకాలను వినియోగించుకోండి'

**బేతంచెర్ల, ఫిబ్రవరి 29:** కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ డోన్ నియోజకవర్గ కన్వీనర్ సందు వెంకటరమణ కోరారు. గురువారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, బుగ్గానిపల్లె, బేతంచెర్ల పట్టణంలో బీజేపీ మండల కన్వీనర్ అంజనేయులు ఆధ్వర్యంలో ఏపీ ప్రజాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ డోన్ అసెంబ్లీ కోకన్వీనర్ న్యాయవాది రవికుమార్, ప్రధాన కార్యదర్శి రవిశంకర్ నాయుడు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్య క్షులు బాలకృష్ణ, నాయకులు మల్లికార్జున, శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

**చాగలమర్రి, ఫిబ్రవరి 29:** మండలంలోని డి.వనిపెంట గ్రామంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. జిల్లా ఎంవీ రూరల్ ఫోక్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం సభ్యులు రవి, వెంకటేష్ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై నాటకం, గేయాల రూపంలో తెలియజేశారు. బ్యాంకు పరిధిలోని ఇన్సూరెన్స్‌ల గురించి తెలియజేశారు.

## 7న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 29:** మహాశివరాత్రి సందర్భంగా గుండు మల్లేశ్వర స్వామి ఆలయ క్రీడా మైదానంలో ఈనెల 7వ తేదీ నుంచి కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉదయ్‌భాస్కర్ రెడ్డి గురువారం తెలిపారు. కబడ్డీ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహు మతి రూ.10వేలు, నాలుగో బహుమతి రూ.8వేలు అందజేస్తామన్నారు. బాల్ బాడ్మింటన్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.8 వేలు, నాల్గవ బహుమతి రూ.6వేలు అందజేస్తామన్నారు. ఈనెల 6వ తేదీ సాయంత్రంలోగా 9441668450 ,9440163032 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## 'పార్టీ మారితే దుకాణాలు ఖాళీ చేయిస్తారా'

**చాగలమర్రి, ఫిబ్రవరి 29:** గ్రామాల్లో తమ నాయకత్వంపై నమ్మకంతో వైసీపీ పార్టీ మారిన కార్యకర్తల దుకాణాలను ఖాళీ చేయిస్తారా, ఖాళీ చేయించినంత మాత్రాన ఎవరు భయపడే పరిస్థితుల్లో లేరని నియోజకవర్గ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు వద్ద లాలు అనే యువకుడు ఏర్పాటు చేసిన బైక్ గ్యారేజీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల టీడీపీలో చేరిన లాలు అనే కార్యకర్త ఓ వైసీపీ నాయకుడి స్థలంలో బైక్ గ్యారేజీని ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నాడు. అభిమానంతో టీడీపీలో చేరిన లాలు బైక్ గ్యారేజీని ఖాళీ చేయించడం వైసీపీ నాయకుల అరాచకానికి పరాకాష్ట అన్నారు. నాయకులు, కార్యకర్తలు టీడీపీ విజయం కోసం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, రఫిద్దిన్, మౌలాలి, అనిఫ్, మాబులాల్, జెట్టి నాగరాజు, అబ్దుల్‌ఖాదర్, కరిముల్లా, గఫార్, అజీమ్, రమేష్, కేఆర్‌కే రవి, బషీర్, నాగూర్, రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

## రేపు జాబ్ మేళా

**నంద్యాల(నూనెపల్లె), ఫిబ్రవరి 29:** నంద్యాల జిల్లాలోని 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్న ట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. కమిషనర్ కళాశాలల విద్యాశాఖ, జవహర్ నాలెడ్జి సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాను కేవలం నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రమేనని ఆమె చెప్పారు. దాదాపు 24 కంపెనీల ప్రతిని.దులు వస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్లను కళా శాలలో విడుదల చేశారు. జేకేసీ కోఆర్డినేటర్ పార్వతి, ప్రతాప్‌రెడ్డి, మహబూబ్ బాషా, గురువయ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## 'సమస్యలు గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం'

**నంద్యాల, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి):** ఒక్క అవకాశం పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నరసింహుడు పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. రాష్ట్రంలో ఎస్టీలను నిర్లక్ష్యం చేశారన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన

**శిరివెళ్ల, ఫిబ్రవరి 29:** మండలంలోని గోవిందపల్లె గ్రామంలోని జొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఆళ్లగడ్డ డివిజన్ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, టెక్నికల్ ఏవో నాగేంద్ర ప్రసాద్, శిరివెళ్ల వ్యవసాయాధికారి సుధాకర్, సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## 'పల్స్ పోలియోను విజయవంతం చేయండి'

**రుద్రవరం, ఫిబ్రవరి 29:** రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ నెల 3వతేదీ నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి శివమోహన్ పిలుపునిచ్చారు. గురువారం రుద్రవరం పీహెచ్‌సీలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 29:** పట్టణంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ గ్రామపెద్దల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. గురువారం ఉదయం ప్రాతఃకాల పూజ, యంత్రాభిషేకం, అవాహిత దేవత ప్రతిష్ఠ హోమం, కూర్మ యంత్ర ధ్వజ ప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. వేద పండితులచే ప్రత్యేక పూజలు చేసి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం పాండురంగ స్వామి ఆలయం నుంచి గాంధీ సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


స్వాగతం-సుస్వాగతం
కీ॥శే॥ ఎన్టీఆర్ గారు
కీ॥శే॥ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి గారు
తెలుగు దేశం
బాబు ష్యూరిటీ
సంక్షేమం
అభివృద్ధి
భవిష్యత్తుకు గ్యారెంటీ
తెలుగదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆశీస్సులతో,
డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా ఎంపికై, మొదటిసారిగా
డోన్‌కు విచ్చేయుచున్న శ్రీ కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి గారికి
స్వాగత సుమాంజలులు...
డోన్‌లో జరిగే ఆత్మీయ సభలో పాల్గొనుటకు
విచ్చేయుచున్న మాజీ ఉపముఖ్యమంత్రివర్యులు
శ్రీ కేఈ కృష్ణమూర్తి గారికి,
మాజీ మంత్రివర్యులు శ్రీ కే ఈ ప్రభాకర్ గారికి,
మాజీఎమ్మెల్యే శ్రీమతి కోట్ల సుజాతమ్మ గారికి,
టీడీపీ నియోజకవర్గ యువనేత
శ్రీ కోట్ల రాఘవేంద్ర రెడ్డి గారికి,
తెలుగు దేశం- జనసేన పార్టీ నాయకులకు,
కార్యకర్తలకు, ప్రజలకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు హృదయపూర్వక
స్వాగత సుమాంజలులు
శ్రీ కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి గారు
కేంద్ర రైల్వేశాఖ మాజీ సహాయమంత్రివర్యులు,
తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి,
డోన్ నియోజకవర్గం
శ్రీ కే.ఈ.కృష్ణమూర్తి గారు
మాజీ ఉప ముఖ్యమంత్రివర్యులు
టి.ఇ.కేశన్న గౌడ్
మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, డోన్